అటకెక్కిన ప్లాస్టిక్ బ్యాగ్‌ల నిషేధం!

యథేచ్ఛగా తక్కువ మందం ప్లాస్టిక్ కవర్ల వాడకం



గురుమూర్తినగర్ డంపింగ్ కేంద్రంలో అంతా ప్లాస్టిక్ మయం



నందానగర్ నుంచి ఏటీపీఆర్ గోడకు ఆనుకుని ఉన్న రోడ్డులో ఇది పరిస్థితి

రంగారెడ్డినగర్: తక్కువ మందం గల ప్లాస్టిక్ బ్యాగ్‌ల నిషేధం జీహెచ్‌ఎంసీ పరిధిలో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి విధించిన బ్యాన్ 2021 సెప్టెంబర్ 30 నుంచి అమలులోకి వచ్చినా నేటికీ అమలుకు నోచుకోవడం లేదు. 50 మైక్రాన్ల మందం గల ప్లాస్టిక్ బ్యాగ్‌లకు బదులుగా 2021 సెప్టెంబరు నుంచి 75 మైక్రాన్ల, అదే విధంగా 2022, డిసెంబరు 31 నుంచి 120 మైక్రాన్ల బ్యాగ్‌లను మాత్రమే వినియోగించాల్సి ఉన్నా నేటికి ఆచరణలోకి రావడం లేదు.

◆ కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో కూరగాయల మార్కెట్లు, పండ్ల మార్కెట్లలో వ్యాపారస్తులు తక్కువ మందం ఉన్న బ్యాగ్‌లను ఉపయోగించడం శోచనీయం. అధికారుల పర్యవేక్షణ లోపం, ప్రజలకు అవగాహన కల్పించడంలో వైఫల్యాల మూలంగా ప్లాస్టిక్ నిషేధం దాదాపుగా అటకెక్కిందనే చెప్పవచ్చు.

టాస్క్‌ఫోర్స్ ఉన్నా శూన్యం..

◆ జీహెచ్‌ఎంసీ పరిధిలో 50 మైక్రాన్లు, అంతకు తక్కువగా ఉన్న క్యారీ బ్యాగ్‌లను నిషేధించేందుకు సర్కిళ్ల పరిధిలో టాస్క్‌ఫోర్స్‌ను జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు నియమించారు. ఇందులో ఉపకమిషనర్, ఏఎంహెచ్‌ఓ, పారిశుద్ధ్య విభాగం అధికారులు సభ్యులుగా ఉంటారు. ప్రధాన మార్కెట్లలో తనిఖీలు నిర్వహిస్తూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగ్‌లకు బదులుగా బట్ట సంచులు, ఎక్కువ మందం గల ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని ప్రోత్సహించేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంటుంది. కాని ఇవేమీ చేపట్టకపోవడంతో తక్కువ మందం గల ప్లాస్టిక్ కవర్ల వాడకం యథేచ్ఛగా కొనసాగుతోంది.

అటకెక్కిన టిఫిన్ బాక్స్‌ల ప్రచారం..

◆ చికెన్, మటన్, చేపల దుకాణాల్లో కొనుగోలుదారులు తమ వెంట టిఫిన్ బాక్స్‌లు తీసుకువచ్చేలా మొదట్లో అవగాహన కల్పించిన జీహెచ్‌ఎంసీ అధికారులు తదనంతరం ఈ విషయాన్ని గాలికొదిలేశారు. దీంతో మటన్, చికెన్, చేపల మార్కెట్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగ్‌ల వాడకం కొనసాగుతూనే ఉంది.



గాంధీనగర్‌లోని చెత్త డంపింగ్ పాయింట్‌లో ప్లాస్టిక్ కవర్లలో ఆహారాన్ని తింటున్న ఆవు

తనిఖీలు చేపట్టకుండా.. నిషేధాన్ని తుంగలో తొక్కుతూ..

◆ పండ్లు, కూరగాయలు, రోడ్ల వెంబడి టిఫిన్ సెంటర్లలో 50 మైక్రాన్లు, అంతకు మించి తక్కువ మందంగల ప్లాస్టిక్ బ్యాగ్‌ల వాడకం కొనసాగుతున్నా వాటిని నియంత్రించాల్సిన టాస్క్‌ఫోర్స్ టీమ్ నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. నెలకోసారి కూడా తనిఖీలు చేపట్టకుండా కేవలం వసూళ్లకే పరిమితమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

◆ అదే విధంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలు చేపడుతున్న దుకాణాలపై అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు నిర్వహిస్తూ వారిచ్చే నెలవారీ మామూళ్లకు ఆశపడి నిషేధాన్ని తుంగలో తొక్కుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

◆ దీంతో షాపూర్‌నగర్, జగద్గిరిగుట్ట, చింతల్, సుచిత్ర తదితర ప్రాంతాల్లోని దుకాణాల్లో యథేచ్ఛగా తక్కువ మందం గల ప్లాస్టిక్ కవర్లు, ఇతర నిషేధిత వస్తువుల అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నాయన్నది వాస్తవం.

పర్యావరణానికి చేటు చేస్తున్న కవర్లు..

◆ జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో పలు బస్తీలు, కాలనీల్లో ఏర్పాటు చేసిన చెత్త సేకరణ పాయింట్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు పెద్ద మొత్తంలో దర్శనమిస్తున్నాయి. ఇళ్లలో వెలువడే చెత్తను ప్లాస్టిక్ బ్యాగ్‌లను నిల్వ చేసి తదనంతరం డంపింగ్ పాయింట్లలో వేస్తున్నారు.

◆ కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలో ప్రతినిత్యం 380 మెట్రిక్ టన్నుల ఇళ్ల వ్యర్థాలు వెలువడుతుండగా వాటిల్లో 15 శాతం ప్లాస్టిక్ కవర్లే ఉండటం పర్యావరణానికి పెను సవాల్‌గా మారుతోంది.

◆ డంపింగ్ పాయింట్లలో వేస్తున్న చెత్తలో ఆహార పదార్థాలను తినే క్రమంలో పశువులు ప్లాస్టిక్ కవర్లను సైతం భుజిస్తున్నాయి. దీంతో పశువుల ప్రేవుల్లో కవర్లు ఇరుక్కుని వాటి ప్రాణాలకు సంకటంగా మారుతోంది.

27 తేదీలోగా అతిథి ఉపాధ్యాయులకు దరఖాస్తులు చేసుకోవాలి

కీసర: కీసరగుట్టలోని తెలంగాణ రాష్ట్ర బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో అతిథి ఉపాధ్యాయుల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ప్రిన్సిపాల్ మధునాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లిష్ మీడియంలో బోధించాల్సి ఉంటుందన్నారు. విద్యార్హతలు అనుభవం కలిగినవారు ధృవీకరణ పత్రాలతో ఈనెల 27వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తెలుగు, హిందీ, సంస్కృతం, ఆంగ్లం, గణితం, సామాన్య, భౌతిక, వృక్ష , జంతు, సాంఘిక శాస్త్రంలో పీజీ, బీఈడీ తత్సమానమైన విద్యార్హతలు కలిగి ఉండాలన్నారు. ఇతర వివరాలకు 9866559681 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

ఐటీఐ కోర్సులకు దరఖాస్తులు షురూ

మేడ్చల్: మేడ్చల్‌లోని పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) కళాశాలలో పలు కోర్సులలో చేరేందుకు విద్యార్థుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శైలజ సోమవారం ఒక ప్రటకన ద్వారా తెలిపారు. కళాశాలలో ఏడాది, రెండేళ్ల కోర్సులకు చేరేందుకు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ నెల 16 నుంచి జూన్ 10 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు సమయంలో విద్యార్థులు కళాశాల ఎంపిక, చదివే కోర్సు, విద్యార్థి వివరాలు, మొబైల్ నెంబర్ సరిగ్గా ఉండేలా చూసుకుని దరఖాస్తు చేయాలని సూచించారు.

ఇగ్నోలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

నాంపల్లి: ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) 2024వ సంవత్సరం అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇగ్నో హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం సంచాలకుడు డాక్టర్ బి.రాజగోపాల్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్, డిప్లొమా, పీజీ సర్టిఫికెట్, పీజీ డిప్లొమా, డిగ్రీ, పీజీ (పోస్ట్‌గ్రాడ్యుయేషన్) కోర్సులు ఉన్నాయని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు బీఏ, బీకాం, బీఎస్సీలో చేరేందుకు పూర్తి ఫీజు రాయితీని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. జూన్ 30వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు పొందవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు ఇగ్నో వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.జీఇగ్నో.ఏసీ.ఇన్ లేదా 9492451812, 040-23117550 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు రవీంద్రభారతిలో సీల్‌వెల్ సుస్వరాలు

గన్‌ఫౌండ్రీ: రవీంద్రభారతిలో సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఫౌండేషన్, శ్రీ భారతి మ్యూజిక్ అకాడమీల ఆధ్వర్యంలో ఈ నెల 21 (నేడు)సీల్‌వెల్ సినీ సుస్వరాలు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ప్రముఖ గాయనీ ఆమని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, సినీ నటుడు మురళీ మోహన్, సీల్‌వెల్ కార్పొరేషన్ సీఎండీ బండారు సుబ్బారావు, కోలేటి దామోదర్ గుప్తాతో పాటు పలువురు ప్రముఖులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. పలువురికి ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, దాసరి పురస్కారాలను అందజేయనున్నట్లు తెలిపారు.

మీసేవ ద్వారా ధ్రువపత్రాల జారీ సులభతరం

సాక్షి,మేడ్చల్ జిల్లా: మీ–సేవ కేంద్రాల ద్వారా ధ్రువ పత్రాలను సులభతరంగా జారీ చేయడానికి అవసరమైన మార్పులు చేస్తున్నట్లు రాష్ట్ర మీ–సేవ కమిషనర్ రవి కిరణ్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ వీసీ మీటింగ్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి మండల పరిధిలో మీ–సేవ ద్వారా జారీ చేసే వివిధ ధ్రువ పత్రాలు జారీ చేసే ప్రక్రియలో ఏర్పడుతున్న ఇబ్బందులకు సంబంధించిన పలు సమస్యలను మండలాల తహసీల్దార్లు ఈ సందర్భంగా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా రవికిరణ్ మాట్లాడుతూ మీ–సేవ ద్వారా జారీ చేసే ధ్రువపత్రాలు సులభతరంగా జారీ చేయడానికి మార్పులు, చేర్పులు చేయడం జరుగుతుందని కమిషనర్ రవి కిరణ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ గౌతమ్, అదనపు జిల్లా కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, మండల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

దేవాదాయ ధర్మాదాయ ఉద్యోగులకు ఐఆర్ కల్పించాలి

సుల్తాన్‌బజార్: దేవాదాయ ధర్మాదాయ శాఖ అర్చక ఉద్యోగులకు గత ప్రభుత్వం ప్రకటించిన ఐఆర్. (ఇంటర్ రిలీఫ్)ను కలపాలని దేవాదాయ, ధర్మాదాయశాఖ అర్చక ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎండోమెంట్స్ అండ్ రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ అయ్యర్‌ను సోమవారం కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు గంధం కర్ణాకర్ నాయుడు, సీహెచ్ బద్రినాథ చార్యులు, కాండూరి కృష్ణమాచార్యులు, పరశురాం రవీంద్రచార్యులు, చంద్రశేఖర శర్మ మాట్లాడుతూ.. అర్చక ఉద్యోగ కుటుంబాలకు కారుణ్య నియామకం ద్వారా ప్రస్తుతం ఆలయాల ద్వారా జీతాలు అందజేస్తున్నారని, వారికి గ్రాంటీన్ ఎయిడ్ ద్వారా జీతాలు రావాల్సి ఉందన్నారు. ఆ ఫైల్‌కు ఫైనాన్స్ శాఖ క్లియరెన్స్ ఇచ్చినా ఎండోమెంట్స్‌లో మాత్రం పెండింగ్‌లో ఉందన్నారు. ప్రస్తుత బడ్జెట్‌లో తమకు జీతాలు ఇచ్చిన ప్రభుత్వానికి ఎలాంటి భారం పడదన్నారు. అలాగే కొంతకాలంగా సర్వీస్ ఇంక్రీమెంట్లు, సాంకేతిక పరమైన అంశాలు నిలిపేశారని పేర్కొన్నారు. దానికి ప్రిన్సిపల్ సెక్రెటరీ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

నిర్మాణాలు కూల్చి.. జేసీబీ డ్రైవర్లు ఇరుక్కుపోయి!

- మాజీ మంత్రి మల్లారెడ్డి భూవివాదంలో ట్విస్ట్
- రెండు జేసీబీలను సీజ్ చేసిన పేట్‌బషీరాబాద్ పోలీసులు

కుత్బుల్లాపూర్: మాజీ మంత్రి మల్లారెడ్డి భూవివాదం కేసు రాజకీయ ప్రాధాన్యత సంతరించుకోవడంతో నిర్మాణాలను కూల్చివేసిన రెండు జేసీబీలను పేట్‌బషీరాబాద్ పోలీసులు సీజ్ చేశారు. జీడిమెట్ల సర్వే నం.82, 83లలో ఉన్న భూమి విషయమై ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి మరో వర్గానికి చెందిన వ్యక్తులకు మధ్య తగదా నెలకొనడంతో ఇరువర్గాల ఇచ్చిన ఫిర్యాదులు మేరకు ఇరువురిపై పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసులు నమోదు చేశారు.

గొడవ విషయం మాకు తెలీదు: డ్రైవర్లు

◆ అయితే కూల్చివేతలకు ఉపయోగించిన జేసీబీలను పోలీసులు సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. దీంతో వాటిని విడిపించుకునేందుకు జేసీబీ డ్రైవర్లు నానా తంటాలు పడుతున్నారు. గొడవ విషయం తమకు తెలియదని... కూల్చివేతలు చేపట్టాలంటేనే తాము జేసీబీలతో వచ్చామని, తీరా కూల్చివేతలు చేపట్టాకా పోలీసులు తమ వాహనాలను సీజ్ చేయడంతో తాము ఇరువరి మధ్య తగాదాలతో ఇరుక్కున్నామని జేసీబీ డ్రైవర్లు వాపోతున్నారు. మూడు రోజులుగా జేసీబీలు స్టేషన్‌లో ఉండటంతో తమకు పని లేకుండాపోయిందని పేర్కొంటున్నారు.



పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీజ్ చేసిన జేసీబీలు..

కోర్టు ద్వారానే డ్రైవర్లు తేల్చుకోవాలి..

◆ ఎమ్మెల్యేలుగా ఉన్న మామ అల్లుళ్లపై కేసులు నమోదు కావడంతో రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. దీంతో కేసు విషయంలో పేట్‌బషీరాబాద్ పోలీసులు సీరియస్‌గా తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయమై పేట్‌బషీరాబాద్ ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్ 'సాక్షి'తో మాట్లాడుతూ... చట్టపరంగా జేసీబీలను సీజ్ చేశామన్నారు. కోర్టు ద్వారానే తేల్చుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వాళ్లు చెప్పిన పని చేసి ఇరుక్కున్నామని జేసీబీ యజమానులు వాపోవడం వారి వంతైంది.

గుర్రపుడెక్క తొలగింపు షురూ



జీడిమెట్ల: ఫాక్స్‌సాగర్ చెరువులో ఉన్న గుర్రపుడెక్క మొక్కలను అధికారులు తొలగిస్తున్నారు. జీడిమెట్లలోని ఫాక్స్‌సాగర్ నీటిలో కొన్ని సంవత్సరాలుగా గుర్రపుడెక్క మొక్కలు విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రతి సంవత్సరం నీటి పారుదల శాఖ అధికారులు ప్రతి సంవత్సరం మొక్కలను తొలగిస్తున్నప్పటికీ విపరీతంగా పెరుగుతున్నాయి. గుర్రపుడెక్క మొక్కలు ఉండటంతో చెరువులో చేపలు పట్టడం కష్టంగా మారింది. దీంతో అధికారులు ప్రస్తుతం చెరువులో ఉన్న కలుపు మొక్కలను యంత్రాల సహాయంతో అధికారులు తొలగిస్తున్నారు. మరింత మంది సిబ్బందితో కలిసి చెరువులో ఉన్న మొక్కలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

నిజాంపేట్: విద్యుత్ ఫీడర్ లైన్ల నిర్వహణ నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని బాచుపల్లి సెక్షన్ ఏఈ శాంతకుమార్ ఓ ప్రకటనలో తెలియజేశారు. 11కేవీ రాజీవ్‌గాంధీనగర్ ఫీడర్ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్, మా విల్లాస్, గుల్‌మోహర్ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 8గంటల వరకు.. వాల్వో ఫీడర్ పరిధిలోని కౌసల్య కాలనీలో ఉదయం 8 నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

డాక్టర్స్ కాలనీ కేబుల్ లైన్ ఫీడర్ పరిధిలో..

విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాలో ఆటంకాలు తలెత్తనున్నాయని ప్రగతినగర్ ఏఈ సమ్మయ్య ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ డాక్టర్స్ కాలనీ కేబుల్ లైన్ ఫీడర్ పరిధిలో ప్రగతినగర్ 60 ఫీట్ రోడ్డు, చర్చి రోడ్డు, జుడియో మాల్, తిరుమల ఫర్నిచర్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని తెలిపారు.

కనుల పండువగా కల్యాణ మహోత్సవం



కుత్బుల్లాపూర్: మేడ్చల్‌లోని బీరప్ప కామరాతి అమ్మవార్ల కల్యాణ మహోత్సవం సోమవారం కనుల పండవగా జరిగింది. ఈ కల్యాణ మహోత్సవంలో కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వామి, అమ్మవార్ల చల్లని దీవెనలు ప్రజలందరిపై ఉండాలని మొక్కుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శ్రీశైలంగౌడ్‌ను సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

24/7 వర్షాకాలంలో.. అందుబాటులో ఉంటాం

నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు



నిజాంపేట్: వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు ఎదురుకాకుండా చేపడుతున్న చర్యలు, ముంపు ప్రాంతాల్లో వరద ప్రమాదాలు జరగకుండా తీసుకుంటున్న జాగ్రత్తలు, దోమల నివారణకు చేస్తున్న కార్యక్రమాలు, రోడ్లపై వ్యాపారాలు, అక్రమ పార్కింగ్‌ల వల్ల ట్రాఫిక్ జామ్‌తో పాటు ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. చెత్త సమస్య శాశ్వత పరిష్కారం కోసం చేపడుతున్న చర్యలు తదితర అంశాలపై నిజాంపేట్ మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావుతో 'సాక్షి'ప్రత్యేక ఇంటర్వ్యూ.

ప్రశ్న: వర్షకాలంలో వరద ప్రమాదాలు జరుగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

జవాబు: వర్షకాలంలో ఎక్కడైతే వరద ఉధృతి ఎక్కువగా ఉంటుందో వాటిని గుర్తించాం. ఇందుకోసం ప్రత్యేకంగా సిబ్బందిని సైతం ఏర్పాటు చేశాం. ఈ సిబ్బంది మూడు షిఫ్టులుగా 24 గంటలు అందుబాటులో ఉంటారు. ప్రజలు కూడా కొంత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

ప్రశ్న: ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని చెబుతున్నారు?

జవాబు: అపార్ట్‌మెంట్ సెల్లార్‌లల్లోకి వరద నీరు చేరినప్పుడు వాచ్‌మెన్‌లను అప్రమత్తంగా ఉంచి విద్యుత్ సరఫరాను నిలిపివేసే విధంగా చూడాలి. సెల్లార్ కల్గిన వారు మోటర్లను ఏర్పాటు చేసుకుంటే వరద నీరు వెంట వెంటనే బయటకు పంపేందుకు వీలు ఉంటుంది. అదే విధంగా నాలాల దగ్గర ఉన్న వారు చిన్న పిల్లలను వర్షం పడే సమయంలో బయటకు పంపవద్దు. ఎక్కడైన నాలాలు ప్రమాదకరంగా ఉంటే మా దృష్టికి తీసుకువస్తే సమస్యను వెంటనే పరిష్కారిస్తాం.

ప్రశ్న: ఇటివల బాచుపల్లిలో రైజ్ నిర్మాణ సంస్థ ప్రహరీ కూలీ 7 మంది కూలీలు చనిపోయారు. ఈ తరహా ప్రమాదాలు జరగకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: ఇప్పటికే కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న నిర్మాణాలను అన్నింటిని పరిశీలించాం. బిల్డర్లకు జాగ్రత్తలు తీసుకోవాలని నోటీసులు సైతం ఇచ్చాం. ఒకవేళ ప్రజలకు ఎక్కడైనా.. ఏమైనా ప్రమాదకరంగా ఇబ్బందికరంగా అనిపించిన వెంటనే తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటాం.

హెల్ప్‌లైన్ నంబర్

వర్షాకాలంలో అత్యవసర సమయాల్లో నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ హెల్ప్‌లైన్ నంబర్: 040-29569800కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కార్పొరేషన్ ప్రజలను అధికారులు కోరుతున్నారు.

ప్రశ్న: వర్షకాలంలో దోమల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. విషజ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. వీటి కోసం ఎలాంటి నివారణ చర్యలు చేపడుతున్నారు.

జవాబు: చెరువులు, కుంటల్లో, వరద నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో లార్వాను చంపేందుకు ఆయిల్ బాల్స్‌ను వదులుతున్నాం. ముందుగా లార్వాను వృద్ధి చెందకుండా చూస్తే దోమలను అరికట్టడం సులువు. ఇంకా అవసరం అనుకున్నప్పుడు ఫాగింగ్ చేసేందుకు ఏర్పాట్లు చేశాం. ప్రజలు కూడా వర్షకాలంలో దోమ తెరలు వాడి జాగ్రత్తగా ఉండాలి.

ప్రశ్న: డంపింగ్ యార్డులో చెత్త కుప్పలు కుప్పలుగా పేరుకుపోతోంది. దీంతో చూట్టు పక్కల ప్రాంతాల వారికి ఇబ్బందులు ఏర్పాడుతున్నాయి. కదా? ఈ సమస్యను ఎందుకు పరిష్కారించడం లేదు.?

జవాబు: నిజాంపేట్ కార్పొరేషన్‌లో సుమారు ప్రతి రోజు 150 మెట్రిక్ టన్నుల చెత్త సేకరిస్తున్నాం. పెరుగుతున్న జనాభాతో చెత్త సైతం రోజు రోజుకు పెరుగుతోంది. డంపింగ్ యార్డులో చెత్త వేసేందుంకు వచ్చినప్పుడు ఆటోలకు కొంత ఇబ్బంది అవుతోంది. దీని కోసం కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో చెత్తను నేరుగా టిప్పర్లలోనే వేసి జవహర్‌నగర్‌కు తరలించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నాం. త్వరాలోనే ఈ సమస్య పరిష్కారం అవుతుంది.

ఘనంగా తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం

పలువురికి కార్టూన్ మిత్ర పురస్కారాలు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హాస్యానందం, సత్కాలభారతీ ఆధ్వర్యంలో రవీంద్రభారతీలో సోమవారం తెలుగు కార్టూనిస్టుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ...హాస్యం మన ఆయూషున్ని పెంచుతుందన్నారు. 'నవ్వడం ఒక భోగం, నవ్వలేకపోవడం ఒక రోగం' అని పెద్దలు ఊరేకే అనలేదని గుర్తుచేశారు. అనంతరం ప్రముఖ కార్టూనిస్టు కృష్ణ కిశోర్ కార్టూన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. అదేవిధంగా హాస్యానందం నిర్వహించిన కార్టూన్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేయడంతో పాటు పలువురికి కార్టూన్ మిత్ర పురస్కారాలు అందజేశారు. సినీ నటుడు హర్షవర్ధన్,సాహిత్యకారులు సుధామ, సాంఘిక సేవకురాలు సత్యవాణి, బాపూరమణ అకాడమీ కార్యదర్శి సుబ్బరాజు పాల్గొన్నారు.

ప్రజల్లో సామాజిక చైతన్యం రావాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

గన్‌ఫౌండ్రీ: ప్రజల్లో సామాజిక చైతన్య విప్లవం రావాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. రవీంద్రభారతీలో మంజునాథ ఫౌండేషన్ తృతీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి గ్లోబల్ ఐకాన్ అవార్డులను సోమవారం ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ సామాజిక సేవా దృక్పథం కలిగి ఉండాలన్నారు. అంతకుముందు చిన్నారుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్ రావు, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, సినీ నటులు పృథ్వీ, కిరణ్, క్రిష్, జగదీశ్వరీ, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్ మామిడి భీంరెడ్డి, ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు మంజుల గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

చలానాలపై దృష్టి.. ట్రాఫిక్ నియంత్రణలో సుస్తీ!



సుచిత్ర రోడ్డులోని ఎస్‌బీఐ బ్యాంక్ వద్ద ఇలా రోడ్డుపై ద్విచక్ర వాహనాలు నిలిపిన దృశ్యం



షాపూర్‌నగర్ రంగ భుజంగ థియేటర్ నుంచి జీడిమెట్ల పారిశ్రామికవాడకు వెళ్లే రోడ్డులో డీసీఎంలు

కుత్బుల్లాపూర్: ట్రాఫిక్ పోలీసులు తమ విధులను పక్కనపెట్టి చలానా విధించే విషయంపైనే దృష్టి సారిస్తున్నారు. దీంతో పలు ప్రధాన రహదారుల వెంట తీవ్ర ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. సుచిత్ర నుంచి గోదావరిహోమ్స్ కాలనీకి వెళ్లే రోడ్డులో ఎస్‌బీఐ బ్యాంకు సమీపంలో మూలమలుపు ఉండటం మూలంగా అక్కడ వందలాది ద్విచక్ర వాహనాలు పార్కింగ్ చేయడంతో ఉదయం మధ్యాహ్నం సాయంత్రం వేళల్లో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది.

◆ ట్రాఫిక్ పోలీసులు కేవలం అక్కడ నిలిపిన వాహనాల ఫొటోలు తీసి చలానా రూపంలో పంపించడమే తప్ప అక్కడ వాటిని పెట్టకుండా నివారించే మార్గాన్ని మాత్రం కనుగొనడం లేదు. అంతేకాకుండా పక్కనే ఉన్న టిఫిన్ సెంటర్, రోడ్డు మీదనే ఏర్పాటు చేసిన తినుభండారాల దుకాణం సైతం ఎప్పుడు రద్దీతో ఉండటం మూలంగా ఈ సమస్య తలెత్తుతుందని పలువురు ఆరోపిస్తున్నారు.

◆ గోదావరి హోమ్స్ నుంచి అటు సుచిత్ర ఇటు కుత్బుల్లాపూర్‌కు వెళ్లే వాహనాలు సైతం ఇటువైపుగా రాకపోకలు సాగిస్తూ వస్తున్నారు. ఈ విషయంపై దృష్టి సారించకుండా కేవలం చలాన్లపైనే ఫోకస్ పెట్టడం మూలంగా ఎవరికి వారే యమునా తీరే అన్నట్లుగా రోడ్డుపక్కనే ద్విచక్ర వాహనాలు నిలిపి వెళ్లడం మూలంగా పలు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి.

◆ అదేవిధంగా రంగా భుజంగా థియేటర్ నుంచి జీడిమెట్ల పారిశ్రామికవాడకు వెళ్లే కాంట వద్ద ఎక్స్ రోడ్డు సమీపంలో ఇరువైపులా ఉన్న దుకాణదారులు భారీ వాహనాలను నిలపడంతో ఇక్కడ కూడా ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో తీవ్ర ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

'కార్యకర్తల శ్రమకు తగ్గ ఫలితం జూన్ 4న వెలువడనుంది'

సుభాష్‌నగర్: మల్కాజ్‌గిరి లోక్‌సభ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకోబోతుందని... పార్టీ కార్యకర్తలు పడిన శ్రమ వృథా కాబోదని బీజేపీ నాయకుడు రావుల శేషగిరి అన్నారు. గాజులరామారం డివిజన్ బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం సోమవారం గాజులరామారంలో జరిగింది. ఈ సందర్భంగా రావుల శేషగిరి మాట్లాడుతూ... ఇటీవల ముగిసిన మల్కాజ్‌గిరి లోక్‌సభ ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు సమిష్టిగా ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్ విజయానికి కృషి చేశారన్నారు.

◆ కార్యకర్తలు పడిన శ్రమకు తగ్గ ఫలితం జూన్ 4న వెలువడనుందన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు అధిష్టానం తగు గుర్తింపు ఇస్తుందన్నారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు సాయినాథ్ నేత, రాష్ట్ర యువమోర్చా మీడియా కన్వీనర్ రేవతిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు సునీల్‌పాటిల్, డివిజన్ ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, నాయకులు సింగారం మల్లేష్, ప్రభాకర్‌రెడ్డి, మురళి, బూత్ కో–ఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.



గాజులరామారం డివిజన్ ముఖ్య నాయకుల సమావేశంలో కార్పొరేటర్ రావుల శేషగిరి